ఏనుగుల దాడిలో ఐదేండ్లలో 2,800 మంది మృతి

గడచిన ఐదేండ్లలో ఏనుగుల దాడుల్లో 2,853 మంది మరణించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాజ్య సభలో అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గురువారం ఈ మేరకు సమాధానమిచ్చారు.
-న్యూఢిల్లీ



కోర్టుల్లో 5 కోట్లకు పైగా పెండింగ్ కేసులు

మొత్తం పెండింగ్ కేసులు	సుప్రీంకోర్టులో
5 కోట్లకుపైగా	84,045
హైకోర్టుల్లో 60,11,678	జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 4.53 కోట్లు

దేశంలోని వివిధ కోర్టుల్లో 5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపింది. ఇందులో ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌లోని కింది స్థాయి కోర్టుల్లో 1.18 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. - న్యూఢిల్లీ

ఐదేండ్లలో 633 మంది

విదేశాల్లో మృతిచెందిన భారత విద్యార్థులు



గత ఐదేండ్లలో విదేశాల్లో వివిధ కారణాలతో 633 మంది భారతీయ విద్యార్థులు మృతిచెందారని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇదే వ్యవధిలో, దాడుల కారణంగా 19 మంది భారత విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని వివరించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ శుక్రవారం పార్లమెంట్‌లో వెల్లడించారు. - న్యూఢిల్లీ

ఐదేండ్లలో 628 పులుల మృతి

పులుల మరణాలు	628
2019	96
2020	106
2021	127
2023	121
2024	178
పులుల దాడుల్లో మరణించినవారి సంఖ్య	349

గత ఐదేండ్లలో దేశంలో 628 పులులు చనిపోయినట్టు కేంద్రం తెలిపింది. అక్రమంగా వేటాడటం, సహజ మరణం, తదితర కారణాల వల్ల ఇవి మరణించినట్టు వెల్లడించింది. గురువారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. - న్యూఢిల్లీ

2022లో దేశంలో ఉన్న మొత్తం పులుల సంఖ్య - 3682

ప్రపంచంలోని మొత్తం పులుల సంఖ్యలో ఇది 75% శాతం

'35 ఏండ్లలోపు వారికి 10% సీట్లు రిజర్వ్ చేయాలి'

న్యూఢిల్లీ: లోక్‌సభలో 10% స్థానాలను 35 ఏండ్లలోపు వారికి రిజర్వ్ చేయాలని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఓ ప్రైవేట్ మెంబర్ బిల్లును శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పార్లమెంటులో యువత స్పష్టంగా మైనారిటీగా ఉన్నదని, ఇది ప్రజాస్వామిక లోటుకు దారితీస్తుందని అందులో పేర్కొన్నారు. మన దేశ జనాభాలో 35 ఏండ్లలోపు వయసు గలవారు 65 శాతానికిపైగా ఉన్నారని తెలిపారు. మన దేశంలో యువ ఎంపీలు తగిన సంఖ్యలో లేరని పేర్కొన్నారు. లోక్‌సభలో యువత కోసం కొన్ని స్థానాలను కేటాయించడం వల్ల యువతకు కూడా రాజకీయాల్లో స్థానం ఉందనే సందేశాన్ని వారికి పంపించవచ్చునని శశిథరూర్ చెప్పారు.

ఆన్‌లైన్ న్యూస్‌పై నియంత్రణ!

ఆన్‌లైన్ న్యూస్ కంటెంట్‌ను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అన్ని రకాల ఆన్‌లైన్ వార్తలు, వార్తా సంబంధిత కంటెంట్, వీడియోలు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా కామెంటరీని సైతం చట్టపరిధిలోకి తీసుకురానున్నది. ఇందుకు సంబంధించి బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ (రెగ్యులేషన్) బిల్లు-2024 పేరుతో ముసాయిదా బిల్లును సిద్ధం చేసింది. న్యూస్ ఇన్‌ఫ్లుయెన్సర్లను 'డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్లు' అనే కొత్త క్యాటగిరీ కిందకు తెచ్చింది. క్యాబినెట్ ఆమోదం తర్వాత ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది.

- 'బ్రాడ్‌కాస్టర్ల' కిందకు న్యూస్ ఇన్‌ఫ్లుయెన్సర్లు!
- వెబ్‌సైట్లు, పాడ్‌కాస్ట్‌లు, సోషల్‌మీడియా కామెంటరీ సహా అన్ని రకాల ఆన్‌లైన్ వార్తలు చట్ట పరిధిలోకి
- బ్రాడ్‌కాస్టింగ్ ముసాయిదా బిల్లులో ప్రతిపాదన

న్యూఢిల్లీ: దేశంలో ప్రస్తుతం ఉన్న అన్ని బ్రాడ్‌కాస్టింగ్ నిబంధనలను ఒకే చట్టం కిందకు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులోభాగంగా కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ యాక్ట్-1995 స్థానంలో బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ (రెగ్యులేషన్) బిల్లు-2024ను తీసుకొస్తున్నది. దీని ప్రకారం సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా వీడియోలు అప్‌లోడ్ చేసే వాళ్లు, పాడ్‌కాస్ట్‌లు చేసే వాళ్లు, ఆన్‌లైన్‌లో కరెంట్ అఫైర్స్ కంటెంట్ రాసేవాళ్లు ఇకపై 'డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్' కిందకు రానున్నారు. ఈ మేరకు జాతీయ మీడియా సంస్థ హిందుస్థాన్ టైమ్స్ వెల్లడించింది. మీడియా లేదా రిజిస్టర్డ్ డిజిటల్ మీడియాతో ఎలాంటి సంబంధం లేని ఆన్‌లైన్ న్యూస్ కంటెంట్ క్రియేటర్లకు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలపై(ఓటీటీ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్) విధించిన నిబంధనలు, బాధ్యతలు వర్తిస్తాయా? అనే దానిపై తొలి నుంచీ ఆందోళన ఉన్నది. అయితే వీరిందరినీ 'డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్' అనే కొత్త క్యాటగిరీ కిందకు తీసుకురావడం ద్వారా తాజా బిల్లులో దీనిపై స్పష్టత ఇచ్చారు. బిల్లు మొదటి ముసాయిదాను గత ఏడాది నవంబర్‌లో ప్రజాభిప్రాయాల నిమిత్తం విడుదల చేశారు. ఆ తర్వాత పలు మార్పులతో బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ రెగ్యులేషన్ బిల్లు -2024 రెండో ముసాయిదాను తాజాగా రూపొందించారు. ఈ బిల్లు కేంద్ర క్యాబినెట్ ఆమోదం పొందిన తర్వాత పార్లమెంట్ ముందుకు రానున్నది.

ఆన్‌లైన్ న్యూస్ కంటెంట్ మొత్తం చట్టం పరిధిలోకి..

'న్యూస్ అండ్ కరెంట్ అఫైర్స్ ప్రోగ్రామ్స్' నిర్వచనాన్ని కూడా తాజా బిల్లులో విస్తృతపరిచారు. ఆడియో, విజువల్, ఆడియో-విజువల్ కంటెంట్, సైన్, సిగ్నల్స్, రైటింగ్, ఇమేజెస్‌పాటు టెక్స్ట్‌ను ఇందులో చేర్చారు. సింపుల్‌గా చెప్పాలంటే, ఆన్‌లైన్‌లో అన్ని రకాల వార్తలు, వార్తా సంబంధిత కంటెంట్, వీడియోలు, సోషల్‌మీడియాలో కామెంటరీ, వెబ్‌సైట్లు, న్యూస్ లెటర్స్, పాడ్‌కాస్ట్‌లు ఇలా మొత్తం అన్నింటినీ చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు.

కంటెంట్ క్రియేటర్స్‌కు కొత్త నిబంధనలు

స్ట్రీమింగ్ సర్వీసెస్, డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్‌కు సంబంధించి ఇంటర్మీడియరీస్, సోషల్ మీడియా సంస్థలకు కొత్త నిబంధనలు తీసుకురానున్నారు. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా కంటెంట్ అప్‌లోడ్ చేసేవారు, తరచూ ట్వీట్ చేసే జర్నలిస్టులు సైతం చట్ట పరిధిలోకి రానున్నారు. కాగా, 'ఇంటర్నెట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్' నిర్వచనం నుంచి ఓటీటీ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్‌ను మినహాయించారు.

యోగి సమావేశాలకు డిప్యూటీ సీఎంల డుమ్మా

యూపీ బీజేపీలో ముదిరిన విభేదాలు

లక్నో, జూలై 26: ఉత్తరప్రదేశ్ బీజేపీలో అంతర్గత విభేదాలు ముదురుతున్నాయి. ఆధిపత్య పోరు తీవ్రమవుతున్నది. సీఎం యోగి ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎంల మధ్య వైరం పెరుగుతున్నది. ఇటీవల సీఎం ఆదిత్యనాథ్ పార్టీ కేడర్‌తో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సమావేశాలకు ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రిజేష్ పాఠక్ గైర్హాజరవుతుండటంతో పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నెల 24న మొరాదాబాద్, బరేలీ డివిజన్ ఎమ్మెల్యేలతో సీఎం యోగి నిర్వహించిన సమావేశానికి కేశవ్ ప్రసాద్ మౌర్య గైర్హాజరు కాగా, 25న జరిగిన మీరట్, ప్రయాగ్‌రాజ్ డివిజన్ ఎమ్మెల్యేల సమావేశానికి బ్రిజేష్ హాజరు కాలేదు. దీంతో యూపీ బీజేపీలో విభేదాలు పెద్దయెత్తున కొనసాగుతున్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

గూగుల్‌కు పోటీగా సెర్చ్‌జీపీటీ

న్యూఢిల్లీ: సెర్చ్‌ఇంజిన్లలో గూగుల్ గుత్తాధిపత్యానికి పెను సవాల్ ఎదురైంది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత చాట్‌బాట్ సేవలను అందిస్తున్న చాట్‌జీపీటీని తీసుకొచ్చిన ఓపెన్ ఏఐ సంస్థ ఈ సవాల్‌ను విసిరింది. 'సెర్చ్‌జీపీటీ' పేరుతో సెర్చ్‌ఇంజిన్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఇది కృత్రిమ మేధ ఆధారిత సెర్చ్‌ఇంజిన్ అని, ప్రస్తుతం ప్రొటోటైప్ దశలో ఉందని తెలిపింది. ఓపెన్ ఏఐ ఈ ప్రకటన చేసిన వెంటనే గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ షేర్లు 3 శాతం మేరకు క్షీణించాయి. సెర్చ్‌ఇంజిన్లలో 91 శాతం వాటా గూగుల్‌దే. ఆ తర్వాత బింగ్ వంటివి ఉన్నాయి. వీటి మాదిరిగా కాకుండా సెర్చ్‌జీపీటీ యూజర్లకు అదనపు సమాచారాన్ని అందిస్తుందని ఓపెన్ ఏఐ చెప్పింది.

రైతులను ఢిల్లీకి కాకుండా లాహోర్‌కు పంపించాలా?

పంజాబ్ సీఎం మాన్ ఆగ్రహం

చండీగఢ్ : పంజాబ్ ముఖ్యమంత్రి, ఆప్ నేత భగవంత్ మాన్ శుక్రవారం కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. హర్యానాలో జరిగిన బహిరంగ సభలో మాన్ మాట్లాడుతూ, శంభు, ఖనౌరీ సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతులను బీజేపీ ప్రభుత్వం ఢిల్లీలోకి అనుమతించడం లేదని మండిపడ్డారు. రైతులు ఢిల్లీలోకి ప్రవేశించడానికి అవకాశం లేకుండా రోడ్లపై భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం ఢిల్లీ నుంచి నడుస్తున్నదని వారు ఢిల్లీకి వెళ్లకపోతే, వారిని లాహోర్‌కు పంపించాలా? అని ప్రశ్నించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నేతృత్వంలోని పంజాబ్ రైతులు 'ఢిల్లీ చలో' కవాతును ఫిబ్రవరి 13న ప్రారంభించారు.

2034 నాటికి '9-5' ఉద్యోగాలు ఉండవ్!

- *ఒకే సమయంలో వివిధ కంపెనీలకు పని చేసే రోజులు*
- *లింక్డ్‌ఇన్ సహ వ్యవస్థాపకుడు రీడ్ హాఫ్‌మన్ అంచనా*

న్యూఢిల్లీ, జూలై 26: కాలం గడుస్తున్న కొద్దీ, టెక్నాలజీలో మార్పులకు అనుగుణంగా నేటి సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకొంటున్నాయి. ఉద్యోగాల తీరు, పని విధానాల్లో కూడా పలు మార్పులు వస్తున్నాయి. టెక్ రంగంలోకి ప్రవేశించిన కృత్రిమ మేధ(ఏఐ)తో జాబ్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రముఖ సామాజిక మాధ్యమం లింక్డ్‌ఇన్ సహ వ్యవస్థాపకుడు రీడ్ హాఫ్‌మన్ తాజాగా భవిష్యత్తు ఉద్యోగాల తీరుపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 2034 నాటికి అంటే మరో పదేండ్లలో ఇప్పుడున్న సంప్రదాయ ఉద్యోగాలు కనుమరుగవుతాయని, ఉదయం 9 గంటలకు ఆఫీస్‌కు వచ్చి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వెళ్లిపోయే ఉద్యోగాలు ఉండబోవని అంచనా వేశారు. రాబోవు రోజుల్లో ఉద్యోగులు ఒకే దగ్గర, ఒకే విధిని నిర్వర్తించబోరని తెలిపారు. ఒకే సమయంలో వివిధ కంపెనీలకు రకరకాల పనులు చేసే రోజులు రానున్నాయని చెప్పారు. దీని వలన అవకాశాలతోపాటు సవాళ్లు కూడా ఉంటాయని ఆయన వివరించారు. స్థిరమైన ఉద్యోగాలు లేకపోవడం, నిపుణులు దీర్ఘకాలంలో ఒకచోట పనిచేయడానికి ఇష్టపడకపోవడం వల్ల సమస్యలు తప్పవని తెలిపారు. ఇదే సమయంలో ఒకే వ్యక్తి తన నైపుణ్యం, ప్రతిభను వివిధ రంగాల్లో చూపడం వలన కంపెనీల ఉత్పాదకత పెరుగుతుందన్నారు. రాబోవు రోజుల్లో ఆతిథ్య రంగం సహా అన్ని సెక్టార్లకు ఏఐ అనుసంధానం అవుతుందని హాఫ్‌మన్ అంచనా వేశారు. టెక్ రంగంలో విస్తృత అనుభవం ఉన్న హాఫ్‌మన్ గతంలో వేసిన పలు అంచనాలు నిజమయ్యాయి. సామాజిక మాధ్యమాలకు విపరీత ఆదరణ వస్తుందని, గిగ్ ఎకానమీ ఊపందుకుంటుందని, కృత్రిమ మేధ విప్లవం రానున్నదని ఆయన ముందుగానే చెప్పారు.

17కి తగ్గిన నీట్ టాప్ ర్యాంకర్లు

- **యూజీ తుది ఫలితాలు విడుదల**
- **టాపర్లలో నలుగురు బాలికలు**
- **స్వల్పంగా తగ్గిన కటాఫ్**
- **ఎన్టీఏ వెబ్‌సైట్‌లో ర్యాంకు కార్డులు**
- **త్వరలోనే కౌన్సెలింగ్ ప్రారంభం**

న్యూఢిల్లీ, జూలై 26: ఎన్నో వివాదాలు, న్యాయపరమైన సవాళ్లు ఎదుర్కొన్న నీట్-యూజీ తుది ఫలితాలు ఎట్టకేలకు విడుదలయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శుక్రవారం వీటి తుది ఫలితాలను తన వెబ్‌సైట్‌లో విడుదల చేసింది. సవరించిన స్కోర్ కార్డులను అందుబాటులో ఉంచినట్టు ఎన్టీఏ అధికారులు తెలిపారు. అర్హత సాధించిన వారి సంఖ్య, కటాఫ్‌లో స్వల్పంగా తగ్గుదల నమోదైంది. త్వరలోనే కౌన్సెలింగ్ ప్రారంభిస్తామని చెప్పారు. ఫలితాలు సవరించిన తర్వాత టాప్ ర్యాంకర్లు సాధించిన వారి సంఖ్య 61 నుంచి 17కు తగ్గింది. వీరిలో నలుగురు బాలికలు ఉన్నారు. ఈ 17 మంది 720కు 720 మార్కులు పొందగా, ఆరుగురు 716, 77 మంది 715 మార్కులు పొందారు. టాపర్లలో రాజస్థాన్‌లో నలుగురు, మహారాష్ట్రలో ముగ్గురు, ఢిల్లీలో ఇద్దరు, యూపీలో ఇద్దరు, బీహార్, బెంగాల్, పంజాబ్, చండీగఢ్, తమిళనాడు, కేరళలో ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీరందరూ 99.9992714 పర్సంటైల్‌తో మొదటి ర్యాంక్ సాధించారు. తొలుత వెల్లడించిన ఫలితాలలో 67 మంది టాప్ ర్యాంకులు పొందగా, తర్వాత పరీక్ష హాల్‌లో కొందరు విద్యార్థులు పూర్తి సమయం వినియోగించుకోలేదన్న కారణంతో కొందరికి ఇచ్చిన గ్రేస్ మార్కులను ఎన్టీఏ ఉపసంహరించడంతో టాపర్ల సంఖ్య ఆరు తగ్గి 61కు చేరింది. భౌతిక శాస్త్రంలో అస్పష్టమైన ఒక ప్రశ్నకు సంబంధించి రెండు సమాధానాలు సరైనవని ఎన్టీఏ పేర్కొనగా, దానిపై నిపుణుల కమిటీ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు కోరిన విషయం తెలిసిందే. ఆ ప్రశ్నకు నాలుగో ఆప్షన్ ఒక్కటే సరైనదని కమిటీ తెలపడంతో, దానిని పరిగణనలోకి తీసుకుని తుది ఫలితాలు విడుదల చేయాలని ఎన్టీఏను కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు సవరించిన తుది ఫలితాలను విడుదల చేశారు. నీట్‌లో అక్రమాలు జరిగాయని, పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని దాఖలైన పలు పిటిషన్లను విచారించిన సుప్రీం కోర్టు రీ టెస్ట్ జరపాల్సిన అవసరం లేదని, అక్రమాలు కొన్ని సెంటర్లకే పరిమితమయ్యాయని స్పష్టం చేస్తూ తీర్పు చెప్పింది. నీట్ పరీక్ష మే 5న జరుగగా, జూన్ 4న ఫలితాలు వెల్లడించారు. తర్వాత పరిణామాలలో జూలై 1న మరోసారి ఫలితాలు ప్రకటించారు. కోర్టు ఆదేశాలు, ఇతర సవాళ్ల అనంతరం తుది ఫలితాలను శుక్రవారం వెల్లడించారు.

బిల్లుల పెండింగ్‌పై జవాబివ్వండి

- **పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల గవర్నర్ల కార్యదర్శులకు సుప్రీంకోర్టు నోటీసులు**
- **కేంద్రహోం మంత్రిత్వ శాఖకు కూడా తాఖీదులు**
- **అసెంబ్లీలో పాసైన బిల్లులను గవర్నర్లు నిలుపుదల చేయడంపై పిటిషన్లు**

ఆరిఫ్ | ఆనంద బోస్

న్యూఢిల్లీ, జూలై 26: పశ్చిమబెంగాల్, కేరళలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్ల మధ్య కొనసాగుతున్న వివాదంపై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. అసెంబ్లీలో పాస్ అయిన బిల్లులను ఆమోదించకుండా గవర్నర్లు పెండింగ్‌లో ఉంచడంపై ఆయా రాష్ట్రాల్లోని టీఎంసీ, ఎల్డీఎఫ్ ప్రభుత్వాలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం పరిగణనలోకి తీసుకొన్నది. మూడు వారాల్లోగా పిటిషన్లపై స్పందన తెలియజేయాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, పశ్చిమబెంగాల్, కేరళ గవర్నర్ల కార్యదర్శులకు నోటీసులు జారీచేసింది. పిటిషన్‌లో కేంద్ర హోంశాఖను కూడా ప్రతివాదిగా చేర్చాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది.

రెండేండ్లుగా పెండింగ్‌లో..

కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ కొన్ని బిల్లులను రాష్ట్రపతి ముర్ముకు కూడా సిఫారసు చేశారని, అవి కూడా ఇంకా ఆమోదం పొందలేదని ఎల్డీఎఫ్ ప్రభుత్వం పేర్కొన్నది. ఏడు బిల్లుల్లో ఒక్కదానికి కూడా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలతో సంబంధం లేదని తెలిపింది. ఈ బిల్లులను గవర్నర్ రెండేండ్లుగా పెండింగ్‌లో ఉంచారని, ఇలాంటి చర్యలు రాష్ట్ర శాసనసభ కార్యకలాపాలను దెబ్బతీస్తాయని, అసమర్థంగా మారుస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన బిల్లులు కూడా ఉన్నాయని తెలిపింది. ఎల్డీఎఫ్ సర్కార్ సుప్రీంకోర్టులో మార్చిలో పిటిషన్ వేసింది. కేరళ ప్రభుత్వం తరపున సీనియర్ అడ్వకేట్ కేకే వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ 'ఇది చాలా దురదృష్టకర పరిస్థితి' అని అన్నారు. గవర్నర్ చాలా కాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచారని, బిల్లును ఆమోదించకుండా నిలుపుదల చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఏ పరిస్థితిలో తిప్పి పంపాలి? లేదా రాష్ట్రపతికి సిఫారసు చేయాలి? అనే దానిపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు.

కారణం చెప్పకుండా నిలుపుదల

తమ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఎనిమిది బిల్లులకు ఆమోదం తెలపకుండా నిలిపివేశారని టీఎంసీ సర్కార్ కోర్టుకు తెలిపింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తమిళనాడు వంటి రాష్ట్రాల్లో జరిగిన పలు పరిణామాలను వివరించారు. సుప్రీంకోర్టు కేసులను విచారణకు తీసుకోగానే.. కొన్ని బిల్లులను ఆమోదించడమో లేదా రాష్ట్రపతికి సిఫారసు చేయడమో జరిగిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఎలాంటి కారణం చెప్పకుండా నిలుపుదల చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 200కు విరుద్ధమని పేర్కొన్నారు.



ప్రపంచ వారసత్వ జాబితాలో అహోం మట్టి సమాధులు

'ఈశాన్యం' నుంచి ఎంపికైన తొలి నిర్మాణాలు

న్యూఢిల్లీ, జూలై 26: అస్సాంలోని అహోం రాజ వంశానికి చెందిన మట్టి సమాధులు 'మొయిడమ్స్'ను శుక్రవారం యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చారు. 2023-24 సంవత్సరానికి గాను మొయిడమ్స్‌ను ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చాలని భారత్ నామినేషన్ సమర్పించింది. మొయిడమ్స్ అనేవి పిరమిడ్ లాంటి ఆకృతిలో భూగర్భ నిల్వల కోసం నిర్మించిన మట్టి సమాధులు. అస్సాంను 600 ఏండ్లు పాలించిన తాయ్-అహోమ్ రాజవంశానికి చెందిన రాజులను ఖననం చేసేందుకు వీటిని నిర్మించారు. రెండంతస్తులు కలిగిన ఈ నిర్మాణంలోకి ప్రవేశించే మార్గం వంపు తిరిగి ఉంటుంది. ఖననం చేయబడిన వ్యక్తి వాడిన వస్తువులు, నగలు, ఆయుధాలను, దుస్తులను ఈ సమాధుల్లో ఉంచేవారు.

సుందర్ పిచాయ్‌కి ఐఐటీ ఖరగ్‌పూర్ గౌరవ డాక్టరేట్

న్యూఢిల్లీ: గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్‌కి తాను చదివిన ఐఐటీ-ఖరగ్‌పూర్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్‌ను అందజేశారు. సుందర్ సతీమణి అంజలికి డిస్టింగ్విష్డ్ అలుమ్నస్ అవార్డును ప్రదానం చేశారు. ఐఐటీ-ఖరగ్‌పూర్ డైరెక్టర్ వీకే తివారీతోపాటు సుందర్ పిచాయ్ తల్లిదండ్రులు, కుమార్తె ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెత్త శుభ్రం చేసే ఈగలు!

సిడ్నీ, జూలై 26: ఆస్ట్రేలియాకు చెందిన మాక్వరీ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు జన్యుసవరణ చేసిన ఈగ (బ్లాక్ సోల్జర్ ఫ్లై)ను అభివృద్ధి చేశారు. ఈ ఈగలు సేంద్రియ వ్యర్థాల నుంచి పరిశ్రమ వ్యర్థాల వరకు అన్నింటినీ తినేస్తాయట. దాంతో చెత్తంతా శుభ్రం అవుతుంది. అంతేకాదు.. లూబ్రికెంట్లు, బయోఫ్యుయల్స్, నాణ్యమైన జంతు ఆహారపదార్థాల తయారీలోనూ ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అటు చెత్తను శుభ్రం చేయటం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని, గ్రీన్ హౌజ్ గ్యాస్ నుంచి ఉపశమనం పొందవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 40-70 శాతం ఆర్గానిక్ వేస్ట్ గుట్టలుగుట్టలుగా పేరుకుపోతున్నది. అలా పేరుకుపోయిన పదార్థాల నుంచి మీథేన్ వాయువు ఉత్పత్తి అయ్యి గ్రీన్ హౌజ్ ఎఫెక్ట్‌కు కారణమవుతున్నది.

నీతి ఆయోగ్ భేటీ బాయ్‌కాట్

- సమావేశాన్ని బహిష్కరించిన దక్షిణాదితో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు
- గైర్హాజరు కానున్న ఏడుగురు సీఎంలు!
- కేంద్ర బడ్జెట్‌లో వివక్షపై నిరసన
- 'సమాఖ్య వ్యవస్థకు తూట్లు' అని విమర్శ
- రాష్ట్ర వ్యాప్త నిరసనలకు డీఎంకే పిలుపు

న్యూఢిల్లీ/చెన్నై/తిరువనంతపురం, జూలై 26: బడ్జెట్‌లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలపై వివక్ష చూపిందని, మోసం చేసిందని ప్రతిపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలపై మోదీ సర్కార్ నిర్లక్ష్యం వహించిందని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బడ్జెట్ కేటాయింపుల తీరుకు నిరసనగా శనివారం ప్రధాని మోదీ నేతృత్వంలో ఢిల్లీలో జరుగనున్న నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశాన్ని పలువురు సీఎంలు బహిష్కరించారు. వీరిలో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ సీఎంలు ఎంకే స్టాలిన్, రేవంత్ రెడ్డి, సిద్దరామయ్య, భగవంత్ మాన్, సుఖ్‌విందర్ సింగ్ సుఖు ఉన్నారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్ కూడా భేటీకి గైర్హాజరయ్యే అవకాశం ఉన్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తాను నీతి ఆయోగ్ భేటీకి హాజరు కాలేనని కేరళ సీఎం విజయన్ కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు.

ఇది కుర్సీ బచావో బడ్జెట్

బడ్జెట్‌లో బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు కేటాయింపులు జరిపి.. విపక్ష పాలిత రాష్ట్రాలకు మొండిచేయి చూపడం ద్వారా కేంద్రం సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడిచిందని పలు రాష్ట్రాల సీఎంలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్‌లో తమిళనాడును పూర్తిగా విస్మరించారని సీఎం స్టాలిన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర హక్కులను కాపాడుకొనేందుకు ప్రజా కోర్టులో తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. తెలంగాణపై ప్రధాని మోదీ కక్ష గట్టారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో అసలు తెలంగాణ పదమే లేకపోవడం దారుణమన్నారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌ను 'కుర్సీ బచావో బడ్జెట్(కుర్చీని కాపాడుకొనే బడ్జెట్)'గా అభివర్ణించారు. విపక్ష పాలిత రాష్ట్రాలపై బీజేపీ రాజకీయ ప్రతీకారానికి పాల్పడుతున్నదని అన్నారు. కాగా, బడ్జెట్‌లో వివక్షను నిరసిస్తూ డీఎంకే పార్టీ శనివారం తమిళనాడు వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నది.

నేడు నీతి ఆయోగ్ సమావేశం

ప్రధాని మోదీ నేతృత్వంలోని శనివారం ఢిల్లీలో నీతి ఆయోగ్ పాలక మండలి 9వ భేటీ జరుగనున్నది. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చేసేందుకు 'వికసిత్ భారత్@2047'పై ప్రధానంగా చర్చించనున్నట్టు అధికారిక ప్రకటన తెలిపింది. నీతి ఆయోగ్ పాలక మండలికి ప్రధాని చైర్మన్‌గా ఉంటారు. అన్ని రాష్ట్రాల సీఎంలు, యూటీల ఎల్జీలు, పలువురు కేంద్ర మంత్రులు సభ్యులుగా ఉంటారు.

నీతి ఆయోగ్‌ను రద్దు చేయాలి: మమత

నీతి ఆయోగ్‌ను రద్దు చేసి ప్రణాళిక సంఘాన్ని మళ్లీ ఉనికిలోకి తేవాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. 'వాళ్లు(బీజేపీ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, ప్రజల మద్దతు లేదు. విపక్ష రాష్ట్రాలను మోసం చేసి రాజకీయ పక్షపాత బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో నీతి ఆయోగ్‌కు ఆర్థిక అధికారాలు లేకపోయినా ఉమ్మడి వేదికపై గళాన్ని వినిపించడాన్ని నా బాధ్యతగా భావించాను' అని ఆమె అన్నారు. ప్రణాళిక సంఘం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు సమస్యల పట్ల చర్చించే అధికారం ఉండేదన్నారు.